# సప్తపది

జడ్జిగారు తన ఎదురుగుండా కూర్చున్న ఆ దంపతుల వంక చూశాడు. చిన్నవాళ్ళు - వయస్సులో ఉన్నవారు - రతీ మన్మథులులా అందంగా వున్నారు. ముఖాలలో చిరునవ్వు చిద్విలాసం లేదు - ముభావం! మోసం - ఒకరి ప్రక్కన ఒకరు కూర్చున్నా - మనస్సులో వెయ్యి ఆమడల దూరం.

"ఈ విషయం గురించి మీ యిద్దరు యింకొక సారి స్థిమితంగా ఉద్రేకాలు ఉద్వేగాలు లేకుండా ఆలోచిస్తే మంచిదేమో!" అని జడ్జిగారు అన్నారు.

"ఒక్కసారి కాదు వందసార్లు ఆలోచించే యీ నిర్ణయానికి వచ్చాను. నాకు విడాకులు కావాలి. యీ కాపురం నాకు అక్కర్లేదు!" అని ఆ చిన్నది పలికింది.

"ఎందుకని యీ కాపురం వద్దనుకుంటున్నావు? నీ భర్త దుర్మార్గుడా?"

"చాలా మంచివాడు."

"నిన్ను మాటలతో కాని - చేష్టలతో కాని హింసించేవాడా?"

"ఎవరిని హింసించే తత్త్వం కాదు అతనిది - నన్ను ప్రాణప్రదంగా చూసుకునే వాడు."

"పరస్త్రీలతో సంబంధం కాని- వ్యభిచార దోషం కాని వుండేదా!"

"ఆయన శ్రీరాముడు లాంటివాడు. ఆయనకు కలలో కూడా అటువంటి ఆలోచనలు రావు."

"త్రాగుడు అలవాటు ఉందా? మాదక ద్రవ్యాలు వాడతాడా?"

"ఎటువంటి చెడు అలవాట్లు ఆయనకు లేవు."

"నిన్ను భర్తగా సరిగ్గా చూసుకునే వాడా?"

"చూసుకునేవాడు. ఇప్పటికీ చూసుకుంటున్నాడు."

"నీ ఇష్టం మీదనే యీ వివాహం జరిగిందా!... నిన్ను బలవంతంగా నీ యిష్టానికి వ్యతిరేకంగా యీ పెళ్ళి చేశారా?"

ఆ పిల్ల జడ్జిగారి వంక ఒక్క క్షణం చూసింది. "సార్! ఈ శ్లోకం మీకు తెలిసే వుంటుంది" అని అంది.

"ఏ శ్లోకం?"

"కన్యా వరయితే రూపం; మాతా విత్తం, పితా శృతం! బాంధవాః కుల మిచ్ఛంతి! మృష్టాన్న మితరేజనాః! ఈ లక్షణాలన్నీ ఇతనిలో వున్నాయి. రూపసి-ధనవంతుడు, విద్యావంతుడు, మంచి కులంలో పుట్టాడు. అతిథి అభ్యాగతులని బాగా చూసుకుంటాడు.

"ఇన్ని మంచి గుణాలు వున్న వ్యక్తి నుంచి నువ్వు విడాకులు కోరుతున్నా వంటే- నాకు మూడు అనుమానాలు వస్తున్నాయి. అడగనా?"

"అడగండి - ఇంత దాకా వచ్చిన తరువాత - సంకోచం దేనికి?"

జడ్జిగారు ఒక్క క్షణం ఆ కుర్రవాడి వంక చూశారు. అతను వీళ్ళ ఇద్దరిని దాటి అనంతంలోకి చూస్తున్నాడు.

జడ్జీగారి మొదటి ప్రశ్న - "నువ్వు నీ భర్తను ప్రేమిస్తున్నావా?"

ఆ పిల్ల ముఖంలో ఆనందం కనిపించింది.

రెండవ ప్రశ్న- "మీ సంసారంలో శృంగారభాగం సంతృప్తికరంగా వుండేదా!'

ఆ పిల్ల సిగ్గుపడ్డది.

మూడవ ప్రశ్న - "నీవు ఎవర్నైనా ప్రేమిస్తున్నావా? అతన్ని వివాహం చేసుకోవడానికి - ఈ విడాకులు కోరుతున్నావా?"

చిన్నది భద్రకాళి అయింది. కోపంతో ముఖం జేవురించింది.

"విడాకులు అడిగాము కదా అని మీరు మమ్మల్ని అవమానపరచనక్కర్లేదు. మీరు చెప్పిన ఏ కారణాల వల్ల మేము విడాకులు కోరుకోవటము లేదు."

"ఏ కారణాల వల్ల విడాకులు మీరు తీసుకోవాలనుకున్నారో నాకు తెలియాలి కదా తప్పకుండా."

"నాకు చిన్నప్పటి నుంచి విదేశాలకు వెళ్ళాలని కోరిక. మా తల్లితండ్రులు ధనవంతులు కాదు. నేను విదేశాలకు వెళ్ళి ఉద్యోగం చెయ్యడానికి పనికి వచ్చే చదువు నాకు లేదు.

కాని నా కోరిక తీరని కోరిక కాకూడదు! రాత్రింబవళ్ళు ఆలోచించాను. ఆ దేశాలలో ఉద్యోగం చేసేవాడిని వివాహం చేసుకుని అక్కడికి వెళ్ళడమే. అదేపని

చేశాను. నా క్వాలిఫికేషన్లు పెంచుకున్నాను. నా అంతట నేను ఉద్యోగం చేయగల స్థాయికి ఎదిగాను. ఉద్యోగం చెయ్యడం మొదలు పెట్టాను. ఇద్దరం రెండు చేతులా సంపాదిస్తున్నాము. ఇల్లు వాకిలి కొనుక్కున్నాము. అక్కడే స్థిరపడి పోతామని ఆశించాను.

కాని యీ మహానుభావుడికి దేశభక్తి ఎక్కువ. యీ దేశంలో పుట్టాను, ఇక్కడ చదువుకున్నాను. నా తెలివితేటలు - నా మేధా సంపత్తి యీ దేశం అభివృద్ధి కోసం ఉపయోగపడాలి. జీతం, సిరిసంపదలు ముఖ్యం కాదు, దేశ ప్రగతి ముఖ్యం" అని అన్నాడు.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసి' అని మంకు పట్టు పట్టాడు.

నేను ఎంత చెప్పినా వినలేదు. అక్కడి ఉద్యోగం మానేశారు. ఇల్లువాకిలి అమ్మేశారు. దేశంలో పేరు గొప్ప - జీతం తక్కువ ఉన్న ఉద్యోగంలో చేరారు. నన్ను కూడా ఉద్యోగం మానేసి యీ దేశం రమ్మన్నారు.

నాకు డబ్బు కావాలి - విలాసాలు, వినోదాలు కావాలి. పుష్టిగా సిరిసంపదలు కావాలి. పదిమందిలో గుర్తింపు ఉండాలి. ఈ అవకాశాలు - స్వశక్తితోనో, భగవంతుడి అనుగ్రహం వల్లనో మాకు సమకూరాయి. వాటిని మూర్ఖంగా కావాలని చేజేతులారా పాడుచేసుకునే వర్తమానం విస్మరించి, గతంలో పయనిస్తూ కాలం చెల్లిన ఆదర్శాలతో బ్రతికే వ్యక్తితో నేను కాపురం చెయ్యలేను. అందుకనే నేను విడాకులు కోరుకుంటున్నాను.

జడ్జిగారు - అతని వంక చూసి, "మీ రేమంటారు?" అని అడిగాడు.

"ఆవిడ చెప్పినదంతా నిజం. ఆవిడ దృక్కోణం నుంచి యీ సమస్యను నేను ఎన్నడూ ఆలోచించలేదు. ఇది కాలం పరిష్కారం చేయగల సమస్య కాదు. భార్య భర్తలు - ధర్మేచ, అర్థేచ, కామేచ అన్న సూత్రానికి కట్టుబడి వుండడం- ఏడు జన్మలు కలిసి జీవించాలనుకోవడం - యీ కలికాలంలో సాధ్యం కాదు అని గ్రహించాను. ఆవిడ మాట ప్రకారమే కానివ్వండి."

జడ్జిగారి మనస్సులోంచి నిట్టూర్పు వచ్చింది. కలం తీసుకుని - ఆ పిటిషన్ మీద తన నిర్ణయాన్ని రాశాడు. వారి ఉభయుల అంగీకారంతో యీ భార్యాభర్తల వివాహం రద్దు చేయబడింది.

ఎవ్వరు రెండవవారికి ఎటువంటి పరిహారం చెల్లించవలసిన అవుసరం లేదు.

ఇద్దరూ కోర్టు బయటకు వచ్చారు. కారు దగ్గర నిలబడ్డారు. ఆ పిల్ల అతని చేతిని తన చేతిలోకి తీసుకుని మనం ఇప్పుడు స్నేహితులం. మంచి

హోటలులో భోజనం పెట్టించి, నన్ను ఎయిర్‌పోర్ట్ దగ్గర దిగపెట్టు" అని అంది.

అన్నీ ఆ చిన్నదాని యిష్టప్రకారమే జరిగాయి. విమానం ఎక్కడానికి లోపలికి వెడుతూ అతని చేతిలో ఒక చిన్న ప్యాకెట్ పెడుతూ "యీ చిన్న కానుక యింటికి వెళ్ళి చూసుకోండి" అని అంది. విమానం బయలుదేరింది. ఆవిడ కోరిక ప్రకారమే యింటికి తెచ్చి ఆ పొట్లం విప్పి చూశాడు.

మట్టెలు, మంగళసూత్రం, నల్లపూసలు ఉన్నాయి.